# స్వీట్ మెమరీస్

- కాకాని కమల

ద గ్రేట్ యునైటెడ్ కింగ్‌డమ్...ఒహియో స్టేట్. రాత్రి నుంచి ఏకధాటిగా మంచు పడుతోంది.

దూదిని ఏకి గాల్లోకి ఎగరేసినట్లు అవిశ్రాంతంగా మంచు పడుతోంది. పెద్ద పెద్ద వ్యానుల్లో తిరుగుతూ ప్రొక్లైనర్సుతో మంచుని తొలగిస్తున్నారు వర్కర్స్.

తీసేది తీస్తుంటే వాళ్ళు సెకండ్ రౌండ్‌కు వచ్చేసరికి మంచుతో రోడ్లు నిండి గ్లాసీగా తయారవుతున్నాయి. రోడ్ల పక్కలంతా కుప్పలు కుప్పలుగా తొలగించిన మంచు బయటకి వెడితే క్షణంలో బిగుసుకుని పోవాల్సిందే.

కిటికీ దగ్గర నుంచుని గ్లాస్ విండోలోంచి బయటకి చూస్తున్నాడు అనిరుధ్.

అర్ధరాత్రి నుంచి విపరీతంగా మంచు కురుస్తుండడంతో స్కూల్స్, ఆఫీసులు మూసేసారు. అక్కడది మామూలే. ఏకాస్త మంచు తగ్గినా ఆఫీసుకు వెళ్లాలి.

వాతావరణం ప్లెజెంట్‌గా ఉన్నా, అనుకోకుండా ఆఫీసుకి సెలవు వచ్చినా అతని మనసంతా చికాకుగా వుంటుంది. వారం నుంచి మనసు స్థిమితంగాలేదు. తలనొప్పిగా వుంది. తలకు బామ్ రాసుకుని కాఫీ తాగాడు. స్ట్రెస్‌కి వేరే కారణం ఉంది. ఆఫీసులో పని వత్తిడి బాగా వుంది.

వారంరోజులుగా రెస్ట్‌లెస్‌గా ఉన్నాడు. దానికి తోడు ఒక ముఖ్యమైన కాగితం మిస్ అయింది. ఆఫీసులో తన ఛాంబర్ ఆల్మారాలో అన్నీ వెదికాడు. ఎక్కడా కనబడలేదు. ఇంటికి తెచ్చినట్లు బాగా గుర్తు. ప్రతీదీ సిస్టమ్‌లో మెమరీ పెట్టడం అలవాటు. కానీ ఎందుకో ఆ విషయం కూడా అశ్రద్ధ చేసాడు. నిన్న పని వత్తిడివల్ల అర్ధరాత్రి దాటిన తరువాత బాగా అలసిపోయి ఇంటికి వచ్చాడు.

ఉదయాన్నే లేచి కాఫీ తాగి ఆ కాగితం కోసం ఇల్లంతా వెదకసాగాడు. ఫైల్స్, పుస్తకాలు... అన్నీ వెదికాడు. అయినా కావాల్సిన కాగితం దొరకలేదు. అది చాలా అవసరం. మనసు మనసులో లేదు.

ఎంత ఆలోచించినా ఆ కాగితం ఎక్కడ పెట్టాడో గుర్తుకు రావడంలేదు. అది పోలేదు, ఎక్కడో మిస్‌ప్లేస్ అయిందని మనసు చెబుతోంది. బట్టల సూట్‌కేస్‌లో పెట్టాడా? అవును... కొన్ని కాగితాలు, తన సర్టిఫికెట్స్... అన్నీ అందులో ఉండాలి.

గభాల్న లేచి మంచం కింద పెట్టిన రెండు సూట్‌కేసులు బయటకి తీసాడు. బట్టలు మంచం మీద పెట్టి అడుగున పెట్టిన ఫైల్స్ బయటకు తీస్తుంటే ఒక పెద్ద సైజు గ్రీటింగ్ కార్డు జారి అతని ఒళ్లో పడింది.

గ్రీటింగ్ కార్డు కవరు పైన రంగురంగుల అందమైన గులాబీల గుత్తి, రిస్ట్‌వాచ్‌లో ఉన్న మగవాని చెయ్యి, గాజుల చేతులు... ఇద్దరూ అటూ ఇటూ ఆ గులాబీలను పట్టుకున్నట్టు మోడ్రన్ డిజైన్. కనీ కనిపించకుండా తండ్రి దస్తూరితో ఆ కవరుమీద ముత్యాలవంటి గుండ్రని అక్షరాలతో అనిరుధ్ పేరు, అతడి అమెరికన్ అడ్రస్, కవర్‌కి దిగువన తండ్రి ఇండియా అడ్రస్. రెండు సంవత్సరాలక్రితం అనిరుధ్ పుట్టినరోజు సందర్భంగా ఇండియా నుంచి తండ్రి పంపిన గ్రీటింగ్ కార్డ్ అది. కళ్ళు సజలాలు అయి బొటబొటా కన్నీరు కారుతుంటే అపురూపంగా కవరులోంచి గ్రీటింగు కార్డుని తీసి తెరిచాడు.

"హ్యాపీ బర్త్‌డే టు యు... హ్యాపీ బర్త్‌డే టు యూ'' అంటూ హృద్యమైన మ్యూజిక్‌తో బర్త్‌డే సాంగ్ మళ్లీ మళ్లీ రిపీట్ అవుతోంది. పుట్టినరోజు శుభాకాంక్షలతో వేలవేల దీవెనలతో అందంగా రాసిన క్యాప్షన్.

బర్త్‌డే అని రాసినచోట సెప్టెంబర్ ఎనిమిది 2003 అన్న డేటు. అది అనిరుధ్ పుట్టినరోజు తారీకు. కింద తల్లిదండ్రుల చేవ్రాలుతో సంతకాలు. తండ్రి పెద్ద హోదాగల ఉద్యోగం చేసాడు. ఇంగ్లీషులో అందంగా సంతకం చేసాడు. తల్లి అంతగా చదువుకోలేదు. వానాకాలం చదువు. తెలుగులో వంకర టింకరగా అమ్మ మహాలక్ష్మి వ్రాలు అని సంతకం చేసింది.

ఎవరో వీపున ఛళ్లున చరిచినట్లయి అనిరుధ్ చివ్వున తలెత్తి క్యాలెండర్‌కేసి చూసాడు.

సెప్టెంబర్ 8, 2005. అంటే...అంటే ఈ రోజు తన పుట్టినరోజా? గభాల్న చేతిలో ఫైలు టేబుల్ మీద పడేసి ఆ గ్రీటింగ్ కార్డుని గుండెలకి హత్తుకున్నాడు.

'హ్యాపీ బర్త్‌డే టు యు' అన్న పాట హృదయంలో మారుమ్రోగుతోంది. శరీరమంతా స్పందన. అతని కళ్లు అవిశ్రాంతంగా వర్షిస్తున్నాయి.

ఆఫీసు పనిలో పడి ఈ రోజు తన పుట్టినరోజన్న సంగతి కూడా మరచిపోయాడు. ఆఫీసుకు వెళ్లివుంటే మేనేజ్‌మెంట్ తరఫున గ్రీటింగ్ అంది ఉండేది. బొకే బల్లమీద ఉండేది. తనకి గుర్తుకువచ్చేది.

కానీ ఆఫీసు కూడా లేకపోవడంతో కాగితం కనిపించలేదన్న చికాకుతో మరచిపోయాడు. రెండు సంవత్సరాలక్రితం తల్లీదండ్రి పంపిన గ్రీటింగ్ తిరిగి ఈ రోజు తన పుట్టినరోజుని గుర్తు చేసింది. బర్త్‌డే సాంగ్ పాడుతోంది. కార్డు కనిపించడంలేదు. తల్లిదండ్రులే కనిపిస్తున్నారు. గుండెకి హత్తుకున్న కార్డులోంచి బర్త్‌డే సాంగ్ మారుమ్రోగుతోంది.

***

తల్లిదండ్రులకు అనిరుధ్ ఒక్కడే కొడుకు. ఆడపిల్లలులేరు. అంతో ఇంతో ఆస్తి వుంది. అనిరుధ్‌ని కంటికి రెప్పలా చూసుకున్నారు. చదువుకి అమెరికా వెళ్లవద్దని పట్టుబట్టారు. కానీ అనిరుధ్ నచ్చచెప్పాడు.

ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో క్రిస్టమస్ సెలవులకి ఇండియా వెళ్లి ఇరవైరోజులకుపైగా ఉండి వచ్చేవాడు. పుట్టినరోజుకి గ్రీటింగ్స్ వచ్చేవి. ఇండియాకి వెళ్లినప్పుడు తల్లి బర్త్‌డే సెలబ్రేట్ చేసేది. 'మా హని ఎప్పుడు వస్తే అప్పుడే మాకు పండుగ' అనేది. రెండేళ్లక్రితం గ్రీటింగ్ కార్డు అందుకున్న పదిరోజులకి కాబోలు ఒకరోజు

ఇండియా నుంచి మేనమామ ఫోన్ చేసాడు అమ్మానాన్నకి సీరియస్‌గా ఉందనీ, వెంటనే బయలుదేరి రమ్మని.

'ఇద్దరూ కారులో వెడుతుంటే బస్సు గుద్దేసిందిట. ఇద్దరూ గాయాలతో హస్పిటల్‌లో వున్నారుట. నువ్వయితే వెంటనే బయలుదేరిరా' అన్నాడు మేనమామ.



ఆఘమేఘాలమద ఇండియా వెళ్లాడు. కానీ అప్పటికే ఇద్దరి శరీరాలు గాజుపెట్టెలో దర్శనమిచ్చాయి. అనిరుధ్‌కి ఫోన్ చేసేసరికి ఇద్దరూ చనిపోయారని, కంగారు పడతాడని చెప్పలేదని అన్నాడు మేనమామ. ఆ తరువాత ఎక్కువగా ఇండియా వెళ్లడంలేదు. తల్లిదండ్రి చనిపోయాక ఆ సంవత్సరపు గ్రీటింగ్ కార్డ్‌ని అపురూపంగా సూట్‌కేసులో భద్రపరచుకున్నాడు. అవే తల్లిదండ్రులు పంపిన ఆఖరి గ్రీటింగ్స్. మనిషి పోయినా ప్రేమ వున్న చోట ఆత్మలు తిరుగుతాయని అంటారు. అదెంతవరకు నిజం?

అనిరుధ్ ఆ గ్రీటింగ్ కార్డును ఆర్తిగా పెదాలకు హద్దుకున్నాడు. చేతివేళ్లతో కన్నీరు తుడుచు కుంటూ యధాలాపంగా బెడ్‌పైకి చూసిన అనిరుధ్‌కి ఫైలు విసరడంతో చెల్లాచెదరై బయటకి వచ్చిన కాగితం కనిపించింది. వారంరోజులుగా ఎంతో టెన్షన్‌తో పెదుకుతున్న కాగితం అది.

'మనిషి పోతే మాత్రమేమి మనసు వుంటది, మనసుతోటి మనసెప్పుడో కలసిపోతది...'

నిజమే జ్ఞాపకాలు మధురమైనవి. తీపి అయినా చేదు అయినా అవి చెదిరిపోవుకదా!

★